నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 28 మే 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

# రైతు నెత్తిన సీడ్ కత్తి

- నడిగడ్డలో కంపెనీలు, ఆర్గనైజర్లు కుమ్మక్కు
- టెస్ట్‌లో విత్తనాలు పాసైనా.. ఫెయిలైనట్లు బురిడీ..
- కాటన్ ప్యాకెట్ ధర తగ్గించేందుకు కుట్ర
- సీడ్ పత్తి సాగు తగ్గించే వ్యూహం
- కర్ణాటకలో సాగుకు కంపెనీల ఆసక్తి
- పట్టించుకోని వ్యవసాయ శాఖాధికారులు
- మోసపోతున్న కర్షకులు

రైతులు సాగుకు సమాయత్తమవుతుండగా.. ఇదే అదునుగా విత్తన మాయగాళ్లు పల్లెలపై పడుతున్నారు. నడిగడ్డ రైతులతో సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు చెలగాటం ఆడుతున్నారు. అమాయక అన్నదాతలను టార్గెట్ చేస్తూ వారు పండించిన సీడ్ పత్తి విత్తనాలు నాణ్యత పరీక్షలో ఫెయిలైనట్లు చూపిస్తూ మోసగిస్తున్నారు. కంపెనీలు ఈ ఏడాది విత్తనాలు ఇవ్వడం లేదని చెబుతూనే.. ప్యాకెట్ ధర కంటే రూ.50 తగ్గించి ఇస్తామని వారిని నమ్మిస్తున్నారు. కర్ణాటకలో లేబర్ ఖర్చులు తక్కువగా ఉన్నందునా అక్కడ సీడ్ పత్తి సాగును ప్రోత్సహించి.. నడిగడ్డలో తగ్గించే కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తున్నది. అయినా వ్యవసాయ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో సీడ్ పత్తి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

– గద్వాల, మే 27



గద్వాల జిల్లాలో సాగైన సీడ్ పత్తిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)


జోగుళాంబ గద్వాల జిల్లాలో కంపెనీలు, ఆర్గనైజర్లు అమాయక రైతులను ప్రతి ఏటా మోసం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. రైతు ఆరుగాలం కష్టపడి సీడ్ పత్తి పండించి కంపెనీలకు విత్తనాలు అందిస్తే నాణ్యత ప్రమాణాల పేరుతో రైతులు నాణ్యమైన విత్తనాలు కంపెనీలకు ఇచ్చినా అవి ఫెయిల్ అయ్యాయని చెబుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులను కాపాడాల్సిన వ్యవసాయశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో రైతులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. రైతుకు ఇచ్చిన విత్తనాలు నాణ్యత లోపం వల్ల పంట రాకపోతే ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో రైతులకు అంతు చిక్కడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు ఇది మా పరిధిలో రాదు మొత్తం ప్రైవేట్ వ్యవహారం అంటూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో రైతు నష్టపోయినా, వారికి చేయూతనిచ్చేవారు కరువయ్యారు.

**దేశంలో అధికంగా..**

దేశంలోనే అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తున్న ప్రాంతం నడిగడ్డ. ఈ ప్రాంతంలో 30 వేల నుంచి 45 వేల ఎకరాల వరకు రైతులు సీడ్ పత్తి సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం రైతులు సీడ్ పత్తి సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో విత్తనాలు ఇచ్చే విషయంలో ఇవ్వకుండా కంపెనీలు, ఆర్గనైజర్లు వారితో చెలగాటం ఆడుతున్నారు. కంపెనీలు విత్తనాలు ఇవ్వడం లేదని ఆర్గనైజర్లు చెబుతూనే, ప్యాకెట్ ధర ప్రస్తుతం ఉన్న దాని కంటే కంపెనీలు రూ.50 తగ్గించి ఇస్తామని చెబుతున్నారని ఆర్గనైజర్లు చెబుతున్నారు. విత్తనాలు ఇవ్వడం లేదంటూనే ప్యాకెట్‌కు ధర రూ.50 తగ్గించి ఇస్తామని చెప్పడం వెనుక మర్మమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటకలో లేబర్ ఖర్చులు తక్కువగా ఉండడంతో అక్కడ సీడ్ ఇవ్వడానికి కంపెనీలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తున్నది. దీంతో ఇక్కడి రైతులకు సీడ్ విత్తనాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం.

**పాసైనా.. ఫెయిలైనట్లుగా చూపుతున్న వైనం**

సీడ్ కంపెనీలు సొంతంగా పెట్టుకున్న జీవోటీ (గ్రో అవుట్ టెస్ట్)ద్వారా విత్తనాలను పరీక్షించి విత్తనాలను ఫెయిల్ అయ్యాయని కంపెనీలు మోసం చేస్తున్నాయి. కానీ రైతులు వారు పండించిన పత్తి విత్తనాలను ప్రైవేట్ ల్యాబ్‌లో టెస్ట్ చేస్తే పాసైనట్లు నిర్ధారణ అవుతున్నాయి. అయితే ఉద్దేశపూర్వకంగా రైతులను కంపెనీలు మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లికి చెందిన చిన్న నర్సింహులు వేదా సీడ్స్ కంపెనీకి చెందిన వీఎస్–999 బీజీ–11 అనేరకం విత్తనాలు పెద్దొడ్డికి చెందిన ఆర్గనైజర్ రాముడు ద్వారా తీసుకున్నాడు. పంట సాగు చేసి విత్తనాలను కంపెనీకి 275611 లాట్ ద్వారా టెస్ట్‌కు పంపిస్తే జెన్‌టిక్ ప్యూరిటీ 78.6 శాతం రావడంతో ఫెయిలైనట్లు కంపెనీ చెప్పిందని రైతు తెలిపాడు. అవే విత్తనాలను రైతు సాహితీ బయోటెక్ ల్యాబ్, ఏలీసా టెస్ట్ రిపోర్టు ద్వారా పరీక్ష చేయిస్తే పాజిటివ్ రావడంతోపాటు 90 శాతం, 100 శాతం జెన్‌టిక్ ప్యూరిటీ వచ్చినట్లు వివరించాడు. అలాగే అదే గ్రామానికి చెందిన డోలు కృష్ణ ఆర్ఎస్–666 రకం వేదా సీడ్స్ కంపెనీ విత్తనాలను సాగు చేసి కంపెనీకి 24991975 అనే లాట్ ద్వారా టెస్ట్‌కు పంపాడు. జెన్‌టిక్ ప్యూరిటీ 78.6 శాతం రాగా ఫెయిల్ అయిందని కంపెనీ, ఆర్గనైజర్లు రైతుకు తెలిపారు. ఇదే విత్తనాలను సాహితీ బయోటెక్ ల్యాబ్, ఏలీసా టెస్ట్ ద్వారా పరీక్షిస్తే పాజిటివ్ 88 శాతం, జెన్ ప్యూరిటీ 97.78 శాతం వచ్చిందని.. రెండింటిలో పాజిటివ్ 90 శాతం, జెన్‌ప్యూరిటీ 100 శాతం వచ్చిందని పేర్కొన్నరు. కంపెనీ ల్యాబ్‌లో ఫెయిల్ కావడం ఏమిటీ..? బయట ల్యాబ్‌లో టెస్ట్ చేస్తే పాస్ ఎలా అవుతున్నాయి..? ఇది ఉద్దేశ పూర్వకంగా కంపెనీలు, ఆర్గనైజర్లు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. బీఆర్ఎస్ రాష్ట్ర నేత కుర్వ విజయ్‌కుమార్ ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కంపెనీలు, ఆర్గనైజర్లు రైతులను ఎలా మోసం చేస్తున్నారో వెల్లడైంది.



**ప్యాకెట్ ధర తగ్గింపుపై ఆగ్రహం**

కంపెనీలు ప్రతిఏటా ఏదో ఓ సాకుతో ఆర్గనైజర్లను అడ్డం పెట్టుకొని రైతులను మోసం చేస్తున్నాయి. ఈ విత్తనాలు ఇచ్చిన కంపెనీ లాభాల్లో ఉంటున్నాయి. కంపెనీలకు రైతులకు మధ్య దళారులుగా వ్యవహరిస్తున్న ఆర్గనైజర్లు రూ.కోట్లకు పడగలెత్తుతున్నారే తప్పా.. కష్టపడి విత్తనాలు పండించిన రైతు మాత్రం వీరి తీరుతో తీవ్రంగా నష్టపోతున్నాడు. ఈ ఏడాది సీడ్ సాగు చేసే రైతులకు కంపెనీలు పెద్ద షాక్‌నిచ్చాయి. విత్తన ప్యాకెట్ ధర రూ.50 తగ్గిస్తున్నామని.. మీ ఇష్టం ఉంటే విత్తనాలు తీసుకోండి.. లేదంటే ఇతర ప్రాంతాల రైతులకు సీడ్ ఇస్తామని కంపెనీలు బ్లాక్ మెయిల్ చేస్తున్నాయి. దీంతో అన్నదాతలకు ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. గత సీజన్‌లో జీఎస్‌ఎం వెరైటీ పత్తి విత్తనాలకు ప్యాకెట్‌కు ధర రూ.500 ఉండగా.. ఈ సీజన్‌లో ధర రూ.450 నిర్ణయించినట్లు తెలుస్తున్నది. కన్వేన్షన్ వెరైటీ రూ.600 ఉండగా.. ఈ ఏడాది రూ.550 వరకు నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే రైతులు సాగు చేసిన సీడ్ పత్తి కల్తీ విత్తనాల వల్ల జర్మినేషన్ రాక ఫెయిల్ కావడంతో తీవ్రంగానష్టపోతున్నారు. దీని తోడు నడిగడ్డలో సీడ్ సాగు తగ్గించే లక్ష్యంతో సీడ్ ఇవ్వక పోవడం.. ధర తగ్గించడం వంటి నిర్ణయాలు తీసుకోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ధర తగ్గిస్తే రైతులు ఎకరాకు రూ.50 వేల వరకు నష్టపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటికైనా వ్యవసాయశాఖ కమిషనర్‌తో కలుగ జేసుకొని న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.




# తడిసిన ధాన్యం

మల్దకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

- మొలకలు వచ్చాయని రైతుల ఆవేదన
- కొనుగోలు చేయాలని డిమాండ్

మల్దకల్, మే 27 : మండలంలో మూడురోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వల్ల మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం మొత్తం తడిసి పోయి మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజులుగా కేంద్రంలో ఉన్నా నేటికి ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తడిచిపోవడంతో తమ ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా లేదా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



మల్దకల్ : కొనుగోలు కేంద్రంలో మొలకలు వచ్చిన ధాన్యం

# నీటమునిగిన వరి పంట



గండీడ్ మండలం రెడ్డిపల్లిలో నీట మునిగిన పంటను చూస్తున్న బాధితురాలు విమలమ్మ

గండీడ్, మే 27 : మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీవర్షాలకు వరి పంటల పొలాలు నీట మునిగాయి. వివరాల ప్రకారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన విమలమ్మ పది ఎకరాల్లో వరి పంట సాగు చేసింది. ఆరు ఎకరాలు కోతకు రావడంతో పంటను కోసి ఇంటి ఎదుట కుప్పగా వేసింది. మిగతా నాలుగు ఎకరాల పంటను కోసి మొత్తం ధాన్యాన్ని అమ్మాలని భావించింది, కానీ సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలుగు ఎకరాల పంట మొత్తం నీట మునిగింది. చేతికి వచ్చిన పంట నీట మునగడంతో విమలమ్మ ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని కోరారు. మంగళవారం ఉదయం ఏఈవో సమత నీట మునిగిన పంటను పరిశీలించింది. నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఏఈవో తెలియజేశారు.

## పీహెచ్‌సీని ప్రారంభించాలి

వడ్డేపల్లి, మే 27 : మండలంలోని జూలేకల్ లో ప్రారంభానికి నోచుకొని వైద్యశాల ఎదుట గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తై రెండేండ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదని గ్రామస్తులు వెంకటేశ్‌యాదవ్, గోపాల్, శేఖర్, భాస్కర్ గౌడ్, ఓబులేస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానకాలంలో దోమల వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉన్నదని, పంచాయతీ కార్యాలయంలోనే వైద్యసేవలను అందించడంతో మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవడానికి ఇబ్బందులకు పడుతున్నారని, త్వరగా వైద్య శాలను ప్రారంభించాలని వారు కోరారు.


ఈ విషయంపై డాక్టర్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా అందరం కొత్తగా వచ్చామని ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుంటానని సమాధానమిచ్చాడు.

# బస్టాపుల్లో నిలవని బస్సులు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



హన్వాడలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



హన్వాడలో బస్సు ఆపకుండా వెళ్తున్న దృశ్యం



ఆటోలో ఎక్కుతున్న మహిళలు

హన్వాడ, మే 27 : మండలకేంద్రమైన హన్వాడలో ఆర్టీసీ బస్సులు ఆపకుండా ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు, మహిళలు ప్రతిరోజూ గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ నిబంధనల ప్రకారం చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపబడును అనే నిబంధన ఉన్నా కనీసం బస్టాప్‌ల్లో ప్రయాణికులు కనిపిస్తున్నా ఆర్టీసీ సిబ్బంది బస్టాపుల వద్ద బస్సులు నిలుపడం లేదని, కొంతమంది డ్రైవర్లు అయితే బస్టాప్‌కు దూరంగా బస్సులను నిలిపి ప్రయాణికులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. కొద్ది మంది చేసేది లేక ఆర్టీసీ బస్సులు ఆపరని ప్రైవేట్ వాహనాలను పట్టుకొని తమతమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తర్వాత మహిళలను చూస్తే ఆర్టీసీ సిబ్బంది బస్సులు ఆపకుండా వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వం ఈ ఉచిత బస్సు పథకం ఎందుకు ప్రవేశపెట్టిందిరా నాయన మమ్మల్ని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నదని మహిళలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్న పరిస్థితి నిత్యం నెలకొన్నది. ఏది ఏమైనా ఆర్టీసీ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్లే ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాపుల వద్ద బస్సులు నిలుపకుండా వెళ్తున్న ఆర్టీసీ సిబ్బందిపై చర్యలు తీసుకొని ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాల్సిన అవసరం ఉన్నది.

# పల్లెల్లో కన్నీటి కష్టాలు

- అయిజ మండలం భూంపురంలో అందని 'భగీరథ' నీళ్లు
- మినీ ట్యాంకులే దిక్కు..
- పట్టించుకోని అధికారులు

అయిజ, మే 27 : మంచినీటి కష్టాలతో పల్లెల్లో ప్రజలు కన్నీరు కారుస్తున్నారు. మిషన్ భగీరథ నీరు అందక పోవడంతో పలు గ్రామవాసులు దాహార్తితోఅలమటిస్తున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేయించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అయిజ మండలం భూంపురంలో కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ నీటిని అందించేందుకు పైప్ లైన్లు, ఇంటింటికీ నల్లాలు అమర్చి సరఫరా చేశారు. సర్పంచుల పదవీకాలం పూర్తయ్యాక.. అధికారుల అలసత్వం కారణంగా నీళ్లు అంతంత మాత్రమే ట్యాంకులకు చేరుతున్నది. దీంతో కొద్దిపాటి నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు నల్లాలకు మోటార్లు బిగించడంతో నీటి కొరత తీవ్రమైంది. అది కూడా రెండ్రోజులకోసారి సరఫరాతో నీటి సమస్య జఠిలమైనది. ఓహెచ్ఆర్ ట్యాంకులకు నీళ్లు చేరక పోవడంతో మినీ ట్యాంకులకు మోటార్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. భగీరథ పైప్‌లైన్ చివరన భూంపురం గ్రామం ఉండటంతో నీళ్లు అందడం లేదు. 40 కేఎల్ ఓహెచ్ఆర్, 20 కేఎల్ ఓహెచ్ఆర్ ట్యాంకులతోపాటు 10 కేఎల్ మినీ ట్యాంకులు ఉన్నాయి. అయితే భగీరథ నీరు అంతంత మాత్రమే వస్తుండడంతో ఓహెచ్ఆర్ ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి. దీంతో వర్షాలు కురుస్తున్న తాగునీటికి మాత్రం కష్టాలు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీటి సమస్య నుంచి తమను గట్టెక్కించాలని కోరుతున్నారు.

**నీటి సరఫరాకు చర్యలు**

మండలంలోని భూంపురం గ్రామానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం 20 కేఎల్, 10 కేఎల్ ట్యాంకులకు మాత్రమే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. గ్రిడ్ అధికారులతో నీటి సరఫరాపై చర్చించాం. గ్రిడ్ అధికారులు నీటి సరఫరాను పుష్కలంగా అందించేందుకు బూస్టర్ పంపును ఎగువన బిగించి భూంపురం, మాగోనిపల్లి గ్రామాలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో నీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సమస్య జఠిలం కాకుండా చర్యలు చేపడుతాం.

- సందీప్‌కుమార్‌రెడ్డి, ఏఈ ఇంట్రా, అయిజ



భూంపురంలో ట్యాంక్ వద్ద నీటిని పట్టుకోవడానికి గుమిగూడిన స్థానికులు


# తుంగభద్రకు వరద

- ఇన్‌ఫ్లో 2,750 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 128 క్యూసెక్కులు
- నీటినిల్వ 11. 474 టీఎంసీలు

అయిజ, మే 27 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా చేరుతున్నది. మంగళవారం ఇన్‌ఫ్లో 2,750 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 128 క్యూసెక్కులు నమోదైంది. టీబీ డ్యాం గరిష్ఠ నీటిమట్టం1633అడుగులకు గానూ, ప్రస్తుతం 1590.52 అడుగుల నీటిమట్టం ఉండగా, 100.855 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.474 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తుతోంది. ఎగువన వర్షాలు మోస్తరులో కురుస్తుండటంతో ఆనకట్టకు భారీగా వరద చేరుతున్నది. ఇన్‌ఫ్లో 16,355 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 16,355 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు చేరుతోందని ఆర్డీఎస్ కర్ణాటక డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 9.4 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నష్ట పరిహారం చెల్లింపు జాప్యంపై నిరసన

- భారత్‌మాల రోడ్డుపై గట్టు, గంగిమాన్‌దొడ్డి రైతుల ఆందోళన



భారత్‌మాల రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న రైతులతో మాట్లాడుతున్న సైట్ ఇన్‌చార్జి అఫ్జల్

గట్టు, మే 27 : భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండో విడుత నష్టపరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై మండలంలోని గట్టు, గంగిమాన్‌దొడ్డి రైతులు గట్టు శివారులో భారత్‌మాల రోడ్డుపై మంగళవారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై ఎటువంటి వాహనాలు వెళ్లకుండా ఆపారు. దీనికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న సైట్ ఇన్‌చార్జి అఫ్జల్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

# పథకాలకు మేము అర్హులం కాదా..?

- ధన్వాడ మండలం హన్మన్‌పల్లి జీపీ ఎదుట గిరిజన మహిళల నిరసన



హన్మన్‌పల్లి జీపీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ధన్వాడ, మే 27 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాకు రావడం లేదు.. మేము సంక్షేమ పథకాలకు అర్హులం కాదా అంటూ గిరిజన మహిళలు హన్మన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు సెంటు భూమి లేదని అయినా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎందుకు ఇవ్వడం లేదని మహిళలు ప్రశ్నించారు. మా అందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ, ఇందిరమ్మ, లక్ష్మి, వినోద, మంగమ్మ, అమృత, మణెమ్మ, ఎల్లప్ప పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు పునరాశ్రయం కల్పిస్తాం

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఊట్కూర్, మే 27 : నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూ నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం పునరాశ్రయం కోసం చర్యలు చేపడుతుందని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. ఊట్కూరు మండలంలోని బాపురం, తిప్రాస్ పల్లి, పెద్దపొర్ల, జీర్ణహళ్లి తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పునరావాసం– పునరాశ్రయం గ్రామ సభలో రైతులతో సమావేశమై ఆయన మాట్లాడారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూసేకరణ సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తిగా భూములు కోల్పోయిన రైతులు పునరాశ్రయం పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేపట్టిన సర్వే లో తప్పులు ఉన్నాయని, తమ భూములు పూర్తిగా కోల్పోయినప్పటికీ రెవెన్యూ రికార్డుల పరంగా తక్కువ భూములు కోల్పోయినట్లు సర్వే రిపోర్టులు ఇచ్చినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, రైతుల సమక్షంలో రీ సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని కోరారు. మరోపక్క ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 60లక్షలు పరిహారం అందించాలని, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవి, ఆర్ఐ కృష్ణారెడ్డి, వెంకటేశ్, ఏవో గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



బాపురం గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్